# కనకధారా స్తోత్రము

(సేకరణ: పి. యల్. నరసింహాచార్య దాసస్)

## ముందు మాట

ఈ స్తోత్రమాల ఒక బంగారు ఉసిరికల జడి వాన. ఒక నాటి మధ్యాహ్నము  భిక్షార్థిగా బయలుదేరారు బాల ఆదిశంకరులు. భవతి భిక్షాందేహి అని ఒక ఇంటి ముందు నిలబడ్డారు. కలిమికి నోచుకోని లేమికి దూరము కాలేని అ ఇంటిలో ఆ వటువుకు వితరణ చేసేందుకు ఏమీ లేక వెలవెల పోతోంది ఆ గృహిణి. ఇల్లంతా వెతికింది ~ బ్రహ్మచారికి ఏ బిక్ష పెట్టలేని తన దుస్థితికి చింతించింది. ఒక ఎండిపోయిన ఉసిరిక కాయ దొతికితే, దాన్ని ఆ వటువు జోలిలో వేసి ~ నా లాంటి దరిద్రులు ఇంతకు మించి ఏమీ ఇవ్వలేను ~ అని మూగబోతున్న గొంతుతో చెప్పింది. ఆ వటువు హృదయము ద్రవించింది ~ దరిద్రముతో దహించుకుపోతున్న ఆ విప్రసతిని కరుణించమని శ్రీదేవిని ఎంతో ఆర్ద్రతతో ప్రార్ధించినారు. వారి ప్రార్ధనకు ఆ మహాలక్ష్మి కరుణించి బంగారు ఉసిరికలను వర్షింపజేసింది. అప్పుడు ఆ ఆదిశంకరులు చేసిన ప్రార్ధనే ఈ కనకధారా స్థవము ~ అధ్బుతమైన స్తోత్రము ~ అందరూ ప్రతి రోజూ పెరుమాళ్ళారాధనలో పఠంచవలసినదీ స్థవము.  మనము మన సంతానానికి నేర్పిద్దాము ~ దాని అంతరార్థాలను విడమరిచి వాళ్ళకు అర్ధమయ్యేలాగా చెబుదాము.

**శ్లో: అంగం హరేః పులక భూషణ మాశ్రయన్తీ**

**భృంగాంగనేవ ముకుళాభరణం తమాలం**

**అంగీకృతఖిల విభూతి రపాంగలీలా**

**మంగల్యదాస్తు మమ మంగళ దేవతాయాః**

ముకుళ ఆభరణమ్ తమాలం~ మొగ్గలను సొమ్ములుగా గల కానుగు చెట్టును; భృంగాంగనేన పులక భూషణం ~ ఆడు తుమ్మెద వలె పులకరించుటే ఆభరణముగా ఉన్న; హరేః అంగమ్ ఆశ్రయన్తీ ~ శ్రీహరి యొక్క దేహమును ఆశ్రయించి ఉన్న; అంగీకృత అఖిల విభూతి ~ అంగీకరింపబడిన సకల ఐశ్వర్యములు గల; మంగళ దేవతాయా ~ మంగళదేవత యొక్క; అపాంగ లీలా ~ క్రీగంటి చూపుయొక్క సౌందర్యము; మమ మాంగల్యదాస్తు ~ నాకు శుభములను చేకూర్చుగాక!

భావము

మొగ్గలు తొడిగిన కానుగు చెట్టును ఆడు తుమ్మెద ఆశ్రయించినట్లు, ఆనంద పారవశ్యముతో పులకరించిన శ్రీ మహా విష్ణువు యొక్క వక్షస్థలమును ఆశ్రయించియున్న, సకల ఐశ్వర్యములకూ నిలయమైన మంగళ దేవత అగు శ్రీమహాలక్ష్మీదేవి యొక్క క్రీగంటి చూపు నాకు శుభమును ప్రసాదించుగాక!

వ్యాఖ్య

మొగ్గలు తొడిగిన తమాల వృక్షాన్ని తుమ్మెద ఆశ్రయిస్తుంది ~ అలాగే ఆనందముతో పరవశించిన శ్రీహరి వక్షస్థలమును లక్ష్మీదేవి ఆశ్రయిస్తుంది. నల్లని కానుగుచెట్టు మొగ్గలను తొడిగి ప్రకాశించునట్లు, నల్లని దేహము గల శ్రీహరి ఉరమున కేశములు భాసిస్తున్నాయి. తమాల వృక్షమున మొగ్గలు వికసించునట్లు శ్రీహరి ఉరమున గగుర్పాటు జరిగింది. మొగ్గలు విరబూయగనే తుమ్మెదలు వచ్చి వాలునట్లు ఆనంద పారవశ్యముచే శ్రీహరి హృదయము గగుర్పాటు చెందగనే మంగళ స్వరూపిణి అగు లక్ష్మీదేవి వచ్చి ఆశ్రయిస్తుంది. భక్తులను చూడగానే పరమాత్మ హృదయము పరవశిస్తుంది ~ పరమాత్మ హృదయము సర్వ శుభాలకు నిలయము కనుక సర్వ శుభ ప్రదాయిని అయిన లక్ష్మీదేవి క్రీగంటి చూపు ఎవరిపై పడుతుందో వారు శుభాలను పొంది ఆనందిస్తారు ~ అశుభాలకు దూరులై సంతసిస్తారు.

**ముగ్ధా ముహుర్విదధతీ వదనే మురారేః**
**ప్రేమ త్రపా ప్రణిహితాని గతాగతాని**
**మాలా దృశో ర్మధు కరీవ మహోత్పలేయా**
**సామే శ్రియం దిశతు సాగర సంభవాయాః**

ప్రతిపదార్థాలు

మహత్ ఉత్పలే ~ గొప్పదైన నల్ల కలువ యందు; మధుకరీవ ముగ్ధా సాగర సంభవాయా ~ ఆడుతుమ్మెదను బోలిన సుందరమైన సముద్రమున పుట్టిన; యా దృశో మాలా ~ ఏ నయనములయొక్క వరుస; మురారే వదనే ~ విష్ణువుయొక్క ముఖము నందు; ప్రేమత్రపా ప్రణిహితాని ~ ప్రేమచేత ప్రేరేపింపబడిన; గతాగతాని ముహుః ~ రాకపోకలను మాటిమాటికీ; విదధతీ ~ కలిగించుచున్నదో; సా మే శ్రియం దిశతు ~ ఆమె యొక్క చూపుల జంట నాకు సంపదను అనుగ్రహించు గాక!

భావము

సాగర పుత్రికయైన  లక్ష్మీదేవియొక్క అందమైన చూపుల జంట ప్రేమతో సిగ్గుతో హరివదనమును వీక్షించుటకు ఆడు తుమ్మెద కలువను ప్రీతితో గాంచునట్లు, ఉర్విళ్ళూరు చున్నది.  ఇలా ముందుకు సాగి వెను దిరుగుచున్న లక్ష్మీ దేవి యొక్క క్రీగంటి చూపు నాకు ఐశ్వర్యమును ప్రసాదించు గాక!

వ్యాఖ్య

ఆడు తుమ్మెద ప్రేమతో కలువను సమీపిస్తున్నది. అలాగే లక్ష్మీదేవి చూపులు ప్రేమతో హరి వదన సరోజముపై వాలుతాయి. నల్ల కలువ అందమును బోలిన నారాయణుని ముఖ కమలమును ప్రేమతో,

సిగ్గుతో లక్ష్మీదేవి వీక్షిస్తున్నది. ప్రేమతో హరిని సమీపిస్తున్న లక్ష్మీదేవి సిగ్గుతో వెనుదిరుగుచున్నది. ప్రేమతో హరిని చూచిన లక్ష్మీదేవిపై శ్రీహరి చూపులు పడగానే సిగ్గుతో వెనుకకు మరలి పోతోంది శ్రీమహాలక్ష్మి. అలా వెళ్తూ వెళ్తూ మళ్ళీ ప్రీతితో శ్రీహరిని దర్శించు ఆ తల్లి చూపు సర్వైశ్వర్యములను ప్రసాదించాలని బాల శంకరులు ప్రార్థిస్తున్నారు.

భగవంతుని సమీపించే భక్తునిలో ప్రేమ, సిగ్గు రెండూ ఉంటాయనేది ఇక్కడ సమన్వయము. భగవదైశ్వర్యము అవగత మగుటచేత ప్రేమ జనిస్తుంది. తన జీవిత వైఫల్యాలు సిగ్గును కలిగిస్తాయి.

**విశ్వామరేంద్ర పద విభ్రమ దాన దక్ష**
**మానందహేతు రధికం మురవిద్విషో పి**
**ఈషనిషీదతు మయిక్షణ మీక్షణార్థ**
**మిందీవరోదర సహోదర మిందిరాయాః**

ప్రతిపదార్థాలు

విశ్వామరేంద్ర పద విభ్రమ ~ సమస్తమైన అమరేంద్ర పదము యొక్క విలాసమును; దాన దక్షం ~ దానము చేయుటయందు సమర్థత గల; మురవిద్విషోపి ~ మురారి యైన శ్రీహరికి; అధికం ఆనందహేతు ~ అనంద కారణమైన; ఇందీవర ఉదర సహోదరమ్ ~ నల్ల కలువ లోపలి భాగమునకు సమానమైన; ఇందిరాయాః ఈక్షణార్థం ~ లక్ష్మీ దేవి యొక్క

అరచూపు; మయి క్షణం ~ నాయందు క్షణకాలము; ఈషత్ నిషీదతు ~ కొంచెము నిలుచుగాక.

భావము

లక్ష్మీదేవి యొక్క కడగంటి చూపు నల్లకలువ లోపలి భాగపు కాంతితో సమానమైనది. సర్వ దేవతలకు శ్రేష్ఠ పదములను అనుగ్రహించు శ్రీమహావిష్ణువునకు ఆమె చూపు అధికానందమును కలిగించుచున్నది. అట్టి లక్ష్మీ దేవి యొక్క అరచూపు క్షణకాలము నాయందు కొద్దిగా నిలుచుగాక!

వ్యాఖ్య

లక్ష్మీదేవి శుభప్రదాయిని. ఆమె దృష్టి మంగళ ప్రదము. సర్వసుఖ నిలయము. ఇంద్రాది పదవులను అనిగ్రహించు దేవతలను తృప్తి పరచు శ్రీ మహావిష్ణువునకు అధికానందానమునిచ్చు సౌభాగ్య స్వరూపిణి లక్ష్మీదేవి. అమ్మ దృష్టి అమృతదృష్టి ~ ప్రేమదృష్టి ~ ఆమె ప్రేమామృత వర్షధారచే మొలకెత్తిన భక్తిమొక్క ~ సుమధుర భావ సుమాలను విరబూసి జ్ఞానామృత ఫలమును ప్రసాదిస్తుంది.

మొక్క నుండీ పువ్వు ~ పువ్వు నుండీ కాయ ~ కాయ నుండీ పండు వచ్చేలోగా ఈ మధ్యలో మొక్క నశించిపోవచ్చు. ఇదే భక్తిలో ఉపేక్ష. అలాంటి సమయాలలో తోటమాలి దృష్టి మొక్కను నశింపకుండా

కాపాడునట్లు ~ అమ్మ దృష్టి మనలోని ఉపేక్షను తొలగించి భగవంతునిపై ఆపేక్షను పెంచి బ్రతుకును దివ్యంగా మార్చుతుంది.

బిడ్డను పట్టించుకోకుండా తల్లి ప్రక్కింటివారితో సంభాషిస్తూ ఉంటే బిడ్డ ఓర్చుకోలేడు ~ కొంగుపట్టి లాగుతాడు ~ పిలుస్తాడు ~ ఏడుస్తాడు. తల్లి తన వంక చూచి నవ్వగానే సంతోషిస్తాడు.

శ్రీమహాలక్ష్మి దివ్య దృష్టి క్షణ కాలము సోకినా చాలు. జన్మాంతరముగా సంక్రమించిన ఉపేక్ష క్షణములో మాయమవుతుంది. మాయ దూరమై మహిమ చేరువవుతుంది.

**ఆమీలితాక్ష మధిగమ్య ముదా ముకుంద**
**నూనంద కన్ద మనిమేష మనంగ తంత్రం**
**ఆకేకరస్థిత కనీనిక పక్ష్మ నేత్రం**
**భూత్యై భవేన్మమ భుజంగ శయాంగనాయాః**

ప్రతిపదార్థాలు

ఆమీలితాక్షమ్ ~ అర్ధనిమీలిత నేత్రములుగల; ఆనందకందమ్ ~ ఆనందమునకు కారకుడైన; ముకుంద ముదా అదిగమ్య ~ ముకుందుని సంతోషముతో పొంది; అనిమేషమ్~ రెప్పపాటెరుగని; అనంగ తంత్రమ్~ మన్మధ తంత్రమై; ఆకేకర కనీనిక ~ సగము మూసినట్లున్న కంటి పాపగల; పక్ష్మ భుజంగశయ అంగనాయాః ~ రెప్పలుగల ఆదిశేషునిపై పవళించి యున్న నారస్యణుని యొక్క భార్య అగు లక్ష్మీదేవి యొక్క;

నేత్రమ్ మమ భూత్తై భవేత్ ~ దృష్టి నా యొక్క సంపదకొరకు అగుకాక!

భావము

మన్మథ ప్రేరితుడై కొద్దిగా కన్నులు మూసికొని ఉన్న ఆనందకారకుడగు విష్ణుదేవుని ప్రేమ వృద్ధిచెందగా, ఆ దివ్యమోమును రెప్పపాటు లేకుండా దర్శించి అతిశయించిన సిగ్గుచే కన్నులను సగము మూసి, కంటిపాపను చివరకు చేర్చి దర్శించునట్టి శేషశాయ అర్ధాంగి అగు లక్ష్మీదేవి దృష్టి నాకు ఐశ్వర్యములను ప్రసాదించుగాక!

వ్యాఖ్య

శ్రీహరి ఇక్కడ శేషశాయి ~ యోగనిద్రారతుడు ~ అదియే అర్ధ నిమీలిత నేత్ర సౌందర్యము. ఆత్మానంద ఆకర్షణనే ఇక్కడ మన్మధ తంత్రము. అంతర్ముఖులైన వారిలో ఆనందము అతిశయించడము సహజము. శ్రీహరి వదన సౌందర్యమును, నిమీలిత నేత్ర ద్వయమును గాంచి శ్రీమహాలక్ష్మి కూడా అతిశయించిన సిగ్గుతో నేత్రాలు సగము మూసింది. మహాత్ముల వైభవము సాధకులలో సిగ్గును పెంచుతుంది. శ్రేయస్సువైపు మొగ్గు చూపేలా చేస్తుంది. ఆంతర్య శోభను నిగ్గు తీర్చుతుంది. లౌకిక విషయాసక్తిని తగ్గిస్తుంది. అట్టి అమ్మ దృష్టిని వాంచిస్తున్నారు బాల శంకరులు.

తల్లి ఒడిలో ఆడుకున్నత వరకూ బిడ్డకు ఏ కోరికలూ లేవు ~ కామాలు తెలియవు. ఒడి వీడగానే జీవితము గడ్డుగా మారింది. ఒడ్డుకు

చేరి తరించాలని అభిలషించేవారు మళ్ళీ అమ్మ ఒడికే చేరాలి ~ ఆమె గుడికే చేరాలి ~ అ కృపా వీక్షణాలతో తడిసి తరించాలి.

**కాలామ్బు దాళి లలితో రసి కైట భారేః**
**ధారా ధరే స్ఫురతి యా పుణ్య తటి దంగనేవ**
**మాతు స్సమస్త జగతాం మహనీయ మూర్తిః**
**భద్రాణి మే దిశతు భార్గవ నందనాయాః**

ప్రతిపదార్థాలు

యా ధారాధరే తటిదంగనేవ ~ ఎవరియొక్క మేఘమునందు మెరుపుతీగ వలె; కైటభారేః కాలాంబుదాళి ~ కైటభుడను దానవునికి శతృవు అయిన వానియొక్క నల్లని మేఘుసరము వలె; లలిత ఉరసి స్ఫురతి ~ మనోహరమైన ఉరమునందు ప్రకాశించునో; సమస్త జగతాం మాతు ~ సమస్త జగత్తునకు మాతృదేవి అయిన; భార్గవనందనాయాః ~ భృగుపుత్రిక అగు లక్ష్మీదేవి యొక్క; సా మహనీయమూర్తిః ~ అటువంటి మనోహరరూపమైన రూపము; మే భద్రాణి దిశతు ~ నాకు శుభాలను ప్రసాదించుగాక!

భావము

కైటభారియగు ఏ శ్రీహరి నల్లని మేఘుకాంతిని బోలిన వక్షస్థలమున మేఘుము నందు మెరుపు వలె శ్రీమహాలక్ష్మి భాసించు చున్నదో, అట్టి

భృగునందిని, సర్వ జగన్మాత యగు శ్రీమహాలక్ష్మి అధ్భుత రూపము నాకు సర్వశుభాలను ప్రసాదించుగాక!

వ్యాఖ్య

కాయకు పండు మారుటయే పూర్ణత్వము ~ మొగ్గకు పువ్వు అగుటయే సార్థక్యము ~ పువ్వుకు సువాసన వైభవము ~ మేఘానికి మెరులు వైశిష్ట్యము. మేఘాశములో తళుక్కున మెరులి మెరిసినట్లు పరమాత్మ హృదయములో భక్తులు వెలిగిపోతుంటారు. శ్రీమహావిష్ణువు మేఘముతోనూ ~ శ్రీ మహాలక్ష్మిని మెరుపుతోనూ ఇక్కడ పోల్చడము జరిగింది. మేఘమున్న చోటే మెరుపు మెరుస్తుంది. పరమాత్మ ప్రభవించిన చోటే ప్రకాశం స్ఫురిస్తుంది.

మెరుపుకు మేఘమాధారము ~ భక్తుల ప్రకాశమయ జీవితానికి పరమాత్మయే ఆధారము. పరమాత్మ కృపకు ఈ విధముగా పాత్రురాలైన జగన్మాత తండ్రులకు బిడ్డగానూ ~ బిడ్డలకు తల్లిగానూ ఆనందాన్ని అందిస్తుంది. కనుకనే జగజ్జననిని భృగునందినిగానూ ~ భృగునందినిని జగజ్జనని గానూ వర్ణించబడింది. అందుకే ఆ తల్లి యొక్క అధ్భుత రూప దర్శనాన్ని వాంచిస్తున్నారు బాల శంకరులు. ఆ దివ్యదర్శనము భక్తులకు సర్వ సౌభాగ్యాలను ప్రసాదిస్తుంది. లలితా సహస్రనామాలలో లలితాంబికను భక్త సౌభాగ్య దాయిని గా స్థుతించడము జరిగింది. భాగ్యమనగా ఐశ్వర్యం లేదా అదృష్టము అని భావము. సౌభాగ్యమనగా

చెదరని ఐశ్వర్యమని భావము ~ అదే భగవదైశ్వర్యము ~ అదే భగవద్విభూతి.

**ప్రాప్తం పదం ప్రథమతః ఖలు యత్ప్రభావాత్**
**మాంగల్యభాజి మధు మాథిని మన్మథేన**
**మయ్యాపతే త్తిదిహ మంథర మీక్షణార్థం**
**మందాలసం చ మకరాలయ కన్యకాయాః**

ప్రతిపదార్థాలు

ప్రథమతః యత్ప్రభావాత్ ~ మొట్టమొదట ఎవరి ప్రభావము వలన; మాంగల్యభాజి మధుమాథిని ~ శుభములను పొందిన మధుసూధనుని యందు; మన్మథేన పదం ప్తాప్తం ~ మన్మధునిచేత స్థానమును పొందబడినది; మకరాలయ కన్యకాయాః~ మొసళ్ళము నిలయమైన సాగరుని కుమార్తె యొక్క; మందాలసం మంథరం ~ మిక్కిలి మందమైన, నెమ్మదైన; తత్ ఈ క్షణార్థమ్ ~ ఆ క్రీగంటి చూపు; ఇహ మయి ఆపతేత్~ ఇక్కడ నా యందు పడునుగాక!

భావము

ఏ దేవియొక్క క్రీగంటి చూపు సోకగానే మంగళాలయుడైన విష్ణుదేవుడు సృష్టి కార్యమున కోరిక గలవాడై సర్వలోక పాలనకు

పూనుకొనెనో, అట్టి శ్రీమహాలక్ష్మి యొక్క మందమైన ఓరచూపు నాయందు నెమ్మదిగా ప్రసరించు గాక!

వ్యాఖ్య

మహావిష్ణువు మంగళాలయుడు. విష్ణువు అనగా సర్వవ్యాపి. విష్ణువుకు జగత్తే ఆలయము ~ అదే నిలయము. ఆయన మంగళస్వరూపుడు కనుక, ఆయన వ్యాపించి యున్న ఈ ప్రపంచము మంగళాలయమైనది. జగన్నాథునికి దివ్యశక్తి అమ్మయే! జగత్తునకు కూడా ఆమెయే శక్తియై, దీప్తియై ఉంది. అనుకూలే జగన్నాథే సానుకూలం జగత్త్రయమ్ ~

జగన్నాథుడు మనకు అనుకూలమైనవాడు ~ జగత్త్రయము మనకు అనుకూలముగా ఉంటుంది. జగన్నాథుడు అనుకూలము కావాలంటే జగన్మాత సానుకూలముగా ఉండాలి ~ అందుకే అమ్మయొక్క క్రీగంటి చూపును అభ్యర్థించడము జరిగింది. జగత్తునందలి మహిమ అంతయూ మాతృమూర్తియే! వనములో పచ్చదనము తానై వనదేవత అయింది. గ్రామములో దివ్యశోభ తానై గ్రామదేవత అయింది. గృహానికి ఆధారమై గృహలక్ష్మిగా కీర్తించబడింది.

పూజనీయా జనైర్దేవీ స్థానే స్థానే పురే పురే
గృహే గృహే శక్తి పరైః గ్రామే గ్రామే వనే వనే

అనిచోట్లా అందరిచేత అర్చింపబడి, ఆరాధింపబడే అమ్మ దృష్టి అందరికీ అన్ని వేళలా అవసరమై ఉంది. ఆమె చూపు కొద్దిగా పడినా, మన బ్రతుకు పెద్దగా వెలిగిపోతుంది.

**దద్యా ద్దయాను పవనో ద్రవిణాంబు ధారా**
**మస్మి న్నకించన విహంగశిశౌ విషణ్ణే**
**దుష్కర్మ ఘర్మ మపనీయ చిరాయ దూరం**
**నారాయణ ప్రణయినీ నతనాంబు వాహః**

ప్రతిపదార్థాలు

దయాను పవనః ~ దయ అనెడి గాలిచే ప్రేరేపింపబడి; నారాయణ ప్రణయినీ ~ నారాయణునియొక్క ప్రియురాలియొక్క; నయన అంబువాహః విషణ్ణే ~ కన్ను అనెడి మేఘము దుఃఖమును పొందిన; అస్మికన్ అకించన శిశౌ ~ ఈ దరిద్రుడు అనే చాతక పక్షి పిల్లయందు; చిరాయ దుష్కర్మ ఘర్మం ~ అనాదిగా ఉన్న పాపమనెడి చెమటను; దూరం అపనీయ ~ దూరమునకు తొలగునట్లు చేసి; ద్రవిణాంబుదారాం దద్యాత్ ~ ద్రవిణమనే జలధారను అనుగ్రహించుగాక!

భావము

చాతక పక్షిపిల్ల గ్రీష్మ తాపముచే తపించునపుడు, గాలి వీచగానే మేఘము వర్షమును కురిపించి దాని తాపాన్ని తీర్చి తృప్తిచెందునట్లు

చేయును. "నేను" అనే చాతక పక్షిపిల్ల పాపమనే గ్రీష్మ తాపముచే బాధపడుచుండగా శ్రీదేవి కటాక్షమనెడి మేఘము అమ్మ దయ అనెడి మారుతముచే కదిలించబడినదియై నా దుష్కృతము అనెడి గ్రీష్మ తాపాన్ని తొలగించి ద్రవిణమనెడి వర్షాన్ని కురిపించి నాకు తృప్తిని ఇచ్చుగాక!

వ్యాఖ్య

పక్షిపిల్ల ఎగరలేదు ~ స్వయముగా చరించి బాధలను తీర్చుకోలేదు ~ తాపాన్ని దూరము చేసుకోలేదు. గాలి వీస్తుంది ~ మేఘము వర్షిస్తుంది ~ పక్షిపిల్ల దాహము తీరుతుంది ~ తాపంకూడా తీరుతుంది. నీటిలో తడిసి తాపాన్ని, నీటిని పానము చేసి దాహాన్ని తీర్చుకుంటుంది. శక్తిహీనమైన పక్షిపిల్లను ప్రకృతియే తల్లియై రక్షించింది. ధనహీనుడైన మానవుని పరమాత్మ తల్లియై ~తండ్రియై ~ గతియై ~ గమ్యమై ~ భర్తయై ~ భాగ్యమై ~ రక్షిస్తాడు. గతములో చేసిన పాపాలు నేడు శాపాలుగా పరిణమించినాయి. దారిద్ర్యమును దారు బత్తెముగా మిగిల్చినాయి. అంతమాత్రాన కృంగిపోనవసరము లేదు. అమ్మను నమ్మి జీవిస్తే చాలు. ఆమె దయాపవనము వీస్తుంది. అంతే కటాక్ష మేఘము ద్రవ్యాన్నికుండపోతగా వర్షిస్తుంది ~ దారిద్ర్య తాపాన్ని తొలగిస్తుంది. ఐశ్వర్యముతో శోభించేలా అనుగ్రహిస్తుంది. తల్లి కృప

ఉంటేనే బాలుడు పెద్దవాడై శోభిస్తాడు ~ జగన్మాత కృపకు దూరమైన వాడు ప్రగతిని సాధించలేడు సరికదా పైపెచ్చు పతనమై దుఃఖిస్తుంటారు.

**ఇష్టా విశిష్ట మతయోపి యయా దయార్ద్ర**
**దృష్ట్యా త్రివిష్టప పదం సులభం లభన్తే**
**దృష్టిః ప్రహృష్ట కమలోదర దీప్తి రిష్టాం**
**పుష్టిం కృషీష్ట మమ పుష్కర విష్టరాయా**

ప్రతిపదార్థాలు

ఇష్టా విశిష్టమ్మతయః అపి~ ఇష్టాపూర్తి కర్మములను ఆచరించుట యందు ఇష్టము లేని వారైనపటికీ; యయా దయార్ద్రదృష్ట్యా ~ ఏదేవియొక్క కృపాధృష్టిచే; త్రివిష్టపపదం సులభం లభంతే ~ త్రిలోకాధిపత్యాన్ని తేలికగా పొందుతున్నారో; సా ప్రహృష్ట కమల ~ అట్టి చక్కగా పుష్పించిన పద్మమునందలి; ఉదర దీప్తిః ~ లోపలి కాంతిని బోలిన; పుష్కర విష్టరాయాః ~ తామరపువ్వును ఆసనముగా కలిగిన దేవి యొక్క; దృష్టిః ఇష్టాం పుష్టిం కృషీష్ట~ చూపు కోరిన భాగ్యమును కలిగించుగాక!

భావము

ఇష్టాపూర్తి కర్మలు చేయుటయందు ఆసక్తి లేనివారు అయినప్పటికీ, ఏ మహాలక్ష్మిదేవి క్రీగంటి చూపు సోకుటచేత

సులభముగా ఇంద్రపదవిని అధిష్టించు చున్నారో, అట్టి పద్మాసనస్థురాలై శోభిస్తూ పద్మమునందలి కాంతినిబోలి ప్రకాశించు అమ్మ యొక్క క్రీగంటి చూపు నాకు కోరిన ఐశ్వర్యమును ప్రసాదించుగాక!

వ్యాఖ్య

యజ్ఞయాగాదులనాచరించుట, ఇష్టాపూర్తి కర్మలను నిర్వహించుట చేత జనులు స్వర్గాది సౌఖ్యాములను అనుభవిస్తారు. అలాంటివి చేయకపోయిననూ శ్రీదేవి కృపావీక్షణమునకు పాత్రులైనవారు అలభ్యమైన ఇంద్రపదవిని కూడా సులభముగా పొందుతారు. పద్మము జ్ఞానానికి సంకేతము ~ శ్రీమహాలక్ష్మి కమలవాసిని. పద్మకాంతిని బోలిన చాయతో ప్రకాశించు చున్నది. ఆమె చూపు జ్ఞానదృష్టి ~ జ్ఞానమునకు మించినది ఈ ప్రపంచములో మరొకటి లేదు ~ అందుచేత లక్ష్మి దేవి అక్షయ సంపదను అనుగ్రహిస్తుంది.

తల్లి చూపు మనపై పడేలా మనము జీవించాలి ~ ఇదే మన జీవన సౌరభము కావాలి. ముందుగా మనము బిడ్డలం కాగలగాలి. ఆ తరువాత అమ్మ దృష్టి ఎలాగూ మనకు దూరము కాదు.

బిడ్డలకు భోజనాన్ని వడ్డించి తల్లి వంట ఇంట్లో అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది ~ కానీ ఆమె దృష్టి అంతా భోజనము చేస్తున్న బిడ్డపైనే వుంటుంది.ఇది ప్రేమ దృష్టి ~ కృపా దృష్టి కూడా!

తల్లి ప్రేమతో చూడడంలోనే బిడ్డ పెరుగుతాడు ~ పెద్దవాడవుతాడు ~ గొప్పవడౌతాడు ~ గణనీయమైన పేరు ప్రఖ్యాతులను ఆర్జిస్తాడు ~ దోషాలు చూడని, మోసాలు తెలియని తల్లి ప్రేమకు సాటి అయినది ముల్లోకాలలో వెదకినా లభించదు. కనుక, అమ్మలకు అమ్మ అయిన రమాదేవి ఓరచూపు ఎవరిపై పడుతుందో వారికి అక్షయ సంపద తప్పక లభిస్తుంది.

**గీర్దేవ తేతి గరుడధ్వజ సుందరీతి**
**శాకాంభరీతి శశిశేఖర విల్లభేతి**
**సృష్టి స్థితి ప్రళయ కేళిషు సంస్థితాయై**
**తస్యై నమ స్త్రిభువనైక గురో స్తరుణ్యై**

ప్రతిపదార్థాలు

గీర్దేవతేతి ~ వాగ్దేవత అగు శారద అనుయు; గరుఢధ్వజ సుంరరీతి ~ గరుడుని కేతనము గల లక్ష్మీదేవి అనియు; శాకాంబరీతి ~ శాంకరి అనియూ; యా సృష్టి స్థుతి ప్రళయ కేళిషు ~ఏ దేవి సృష్టి స్థితి లయాదులను ఆటలయందు; సంస్థితా ~ ఉండునట్టి; తస్యై త్రిభువన ~ ఆ త్రిలోకములకు; ఏకగురోః ~ ఆద్య గురువైన శ్రీహరియొక్క;తరుణ్యై నమః ~ పత్నియగు లక్ష్మీదేవికి నమస్కారము.

భావము

సృష్టికాలమున  బ్రహ్మదేవుని పత్నియగు శారద పేరుతోను ~ స్థితికాలమున విష్ణుదేవుని పత్ని యగు లక్ష్మీదేవి పేరుతోనూ, లయకాలమున శంకరుని పత్నియగు శాంకరి పేరుతోనూ ~ శోభిల్లుతూ ఉన్న శ్రీమన్నారాయణుని సతియగు శ్రీమహాలక్ష్మికి నమస్కారము.

వ్యాఖ్య

తల్లి వంట చేస్తుంది ~ ఆ తల్లే వడ్డిస్తుంది ~ ఆ తల్లియే చివరగా విస్తరిని ఏత్తివేస్తుంది.  దీని భావమేమిటంటే ~ వంట చేయడము సృష్టి ~ వడ్డించడము స్థితి ~ ఖాళీ చెయ్యడము (శుభ్రపరచడము) లయ  -
ఈ  మూడునూ ఒకే తల్లి చేస్తున్నా, వంటచేసే తల్లి ~ వడ్డించే తల్లి ~ విస్తరి తీసేసినపుడు శుభ్రము చేసే తల్లి ~ అని పేరు పేరు పేర్లతో పిలిచినట్లు ~ లక్షమ్మ ఒక్కతే శారదమ్మగా ~ పద్మజమ్మగా ~ పార్వతమ్మగా ~ పిలువబడుతుంది. ఆమెయే ఆదినారాయణుని అర్ధాంగి ~ శేషశయనుని రాణియే అశేష జనావళికి ఆధార శక్తి.  శేషశయనుడు స్థితికారకుడు ~ పరిపాలకుడు ~ ఆదిశేషునిపై పవ్వళించే  నారాయణుడు నిద్రలో ఉంటాడు ~ ఇదే యోగ నిద్ర .

ఉనికి యేమో యోగనిద్ర ~ ఉద్యోగమేమో లోక రక్షణ ~ ఏమిటో ఈ వైరుధ్యము? అని అనిపిస్తుంది కదా! అదే నారాయణుని వైభవము. ఆయన రెప్పపాటులో చతుర్దశ భువనాలు రక్షింపబడుతాయి ~ అట్టి

పరమాత్మునికి రాణి శ్రీమహాలక్ష్మి దృష్టియే సర్వమంగళము ~ అట్టి తల్లికి నమస్కారము

లక్ష్మీనారాయణులను జననీజనకులుగా పొందిన వారికి అలభ్యమేముంటుంది?

పదకవితా పితామహుడు అన్నమాచార్యులు గారు ఇలా కీర్తించినారు:

తల్లి మహాలక్ష్మి ~ తండ్రి వాసుదేవుడు ~ ఇల్లు మాకు బ్రహ్మాండమింతా నిదె బల్లిదపు హరిభక్తి పాడి బంటా నాకు ~ వొల్లము కర్మఫలము లొకటి నేము.

**శృత్యై నమోస్తు శుభకర్మ ఫల ప్రసూత్యై**
**రత్యై నమోస్తు రమణీయ గుణార్ణవాయై**
**శక్త్యై నమోస్తు శతపత్ర నికేతనాయై**
**పుష్ట్యై నమోస్తు పురుషోత్తమ వల్లభాయై**

ప్రతిపదార్థాలు

శుభకర్మ ఫల ప్రసూత్యై ~శుభకర్మముల ఫలమునకు కారణమైనది; శృత్యై నమోస్తు ~ వేదస్వరూపిణి అగు లక్ష్మీదేవికి నమస్కారమగుగాక! రమణీయ గుణార్ణవాయై రత్యై నమః ~ గుణసాగరమైన ఆనందరూపిణి అగు శ్రీదేవికి నమస్కారము; అస్తు ~

అవుగాక! శతపత్ర నికేతనాయై నమః అస్తు ~ నూరురేకులుగల పద్మమునందు వసించు మహాశక్తికి నమస్కారము అగుగాక! పురుషోత్తమ వల్లభాయై ~ పురుషోత్తముని భార్య యగు; పుష్ట్యై నమః అస్తు ~ పుష్టిరూపుణి అగు శ్రీమహాలక్ష్మికి నమస్కారము అగుగాక!

భావము

శుభకర్మల ఫలమునకు కారణమైన వేదమాతయగు లక్ష్మీదేవికి నమస్కారము. దయాది రమణీయ గుణాలకు సాగర రూపిణియైన రతీదేవికి నమస్కృతులు. శతపత్ర కమలవాసినియగు లక్ష్మీదేవికి నమస్కారము. పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువునకు ప్రియురాలైన పుష్టిదేవి యగు శ్రీదేవికి నమస్కారము.

వ్యాఖ్య

అమ్మ ~ వేదమాతగా ~ రతీదేవిగా ~ కమలవాసినిగా ~పుష్టిదేవిగా వర్ణించబడినది. మానవుడు తన నాలుగు జీవితదశలలో ఆచరించి పొంద దగినదంతయూ ఇక్కడ చెప్పినారు.

శైశవే భ్యస్తవిద్యానామ్ శైశవమునందే విద్యలు~ వేద విద్యలు ~ నేర్చుకోవాలి. వేదోఖిలధర్మమూలమ్ సర్వధర్మములను తెలుపునది వేదమేకనుక వేదమాతయైన లక్షీదేవిని ఆశ్రయించాలి.

యౌవనే విషయైషిణామ్ యౌవనమునందు ఆశించిన విషయమునందు తృప్తిచెందడం జరుగుతుంది. తనకు నచ్చిన, తాను మెచ్చిన వ్యక్తిని జీవిత భాగస్వామినిగా గ్రహించి సంతతికొరకు ధర్మబద్ధముగా జీవించాలి. అమ్మ అనుగ్రహమువల్లే అనుగ్రహము ప్రాప్తిస్తుంది. అందుకే తల్లి రతీదేవిగా పూజలందుకుంటుంది.

వార్ధకే ముని వృత్తీనామ్ ముసలితనంలో మునివృత్తిని స్వీకరించాలి. తాపసులైన మహాత్ములనాశ్రయించి జ్ఞానమును పొంది తపస్సులో కొనసాగాలి. ఇది జ్ఞానవైరాగ్య సంపంట దశ. ఈ దశలో కూడా అమ్మ అనుగ్రహము పూర్ణముగా ఉండాలి. పద్మము జ్ఞానానికి సంకేతము ~ శత పత్ర పద్మవాదిని యైన శ్రీమహాలక్ష్మి కృపకు పాత్రులైనవారు జ్ఞానవైరాగ్యాలను పొంది తృప్తి చెందుతారు.

యోగేనాంతే తనుత్యజామ్ చివరగా దేహమును యోగముతో త్యజించాలి ~ అంటే పరమాత్మతో ఏకమై భాసించడము.

తం విద్యా ద్దుఃఖ సమ్యోగ వియోగమ్ యోగ సంజ్ఞితమ్ ఏదుఃఖమూ అంటని స్థితిలో ఆనందమే స్వరూపముగా మిగిలిన యోగస్థితిలో అసంతృప్తికీ ~ నిరాశకు ~ కన్నీళ్ళకూ తావులేదు. అక్కడే ముముక్షువునకు పుష్టి ~ సంతుష్టి లభిస్తుంది. ఇది గూడా అమ్మ

అనుగ్రహామువల్లే ప్రాప్తిస్తుంది ~ అందుకే లక్ష్మిని పుష్టిదేవిగా కీర్తిస్తారు. ఇదే పుష్టిమార్గము.

నమామి త్వా మహం దేవి మహాభయ వినాసినీమ్

మహాదుర్గ ప్రశమనీం మహాకారుణ్య రూపిణీమ్

గొప్పదైన భయమును పోగొట్టునది ~ గొప్పదైన ఆపదలను నశింపచేయునది గొప్ప దయగల తల్లియగు ఓ దేవీ ! నీకు నమస్కారము.

**నమోస్తు నాళీక నిభాననాయై**

**నమోస్తు దుగ్ధోదధి జన్మభూమ్యై**

**నమోస్తు సోమామృత సోదరాయై**

**నమోస్తు నారాయణ వల్లభాయై**

ప్రతిపదార్ధాలు

నాళీక నిభాననాయై నమః అస్తు ~ కమలమువంటి మోము ఉన్న దేవికి నమస్కారము అగుగాక! దుగ్ధోదధి జన్మభూమై నమోస్తు ~ పాలసముద్రము పుట్టినిల్లుగా గల దేవికి నమస్కారమగు గాక! సోమ అమృత సోదరాయైనమోస్తు ~ చంద్రునకు అమృతమునకు తోబుట్టువైన లక్ష్మీదేవికి నమస్కారమగు గాక! నారాయణ వల్లభాయై నమః అస్తు ~ నారాయణునికి రాణియగు శ్రీమహాలక్ష్మికి నమస్కారమగుగాక!

భావము

పద్మము వంటి మోము కలదియు ~ క్షీరసాగరమున చంద్రునితోను, అమృతముతోను పుట్టినదియు, విష్ణుదేవునకు రాణియునగు లక్ష్మీదేవికి నమస్కారము.

వ్యాఖ్య

ప్రపంచాన్ని చూస్తే మోహం జనిస్తుంది. ఈ ప్రపంచములో ఏ ముఖమైనా వాంచలను రేపేందుకే ఉంది. అమ్మ మోము కమల శోభతో గోచరిస్తుంది. అది జ్ఞాన వైభవము ~ కనుక మోహమును తుడిచేస్తుంది ~ మోక్షానికి దారిని దుగమం చేస్తుంది. బిడ్డ తల్లి కొరకు రోదిస్తాడో గానీ ~ ఆమె కట్టుకున్నది పట్టుచీరేనా? ఆమె పెట్టుకున్నవి పసిడి నగలేనా? అని చూడడు. అందుచేత అమ్మ మోమును చూస్తూ విలపిస్తాడు. అమ్మ ముఖారవిందం కనిపించగానే బిడ్డ ఏడవడము మానేస్తాడు. అమ్మ ముఖం తప్ప అన్ని ముఖాలు ఇక్కడ ఏడిపించేదుకే ఉన్నాయి. క్షీరసాగరమున పుట్టింది లక్ష్మీమాత ~ ధవళ వర్ణము శుద్ధ సత్త్వ సంపద జనిస్తుంది. పాలసముద్రమున పుట్టిన చల్లని తల్లి చంద్రునికి, అమృతానికి సహోదరి. చంద్రుడు మేనులను~ మనములను చల్లబరుస్తాడు. అలాగే అమృతము మరణాన్ని నివారిస్తుంది. సోమామృత సోదరియగు అమ్మ కూడా చంద్రునివలె జీవితాన్ని చల్లగా ఉండేలా ఆశీర్వదిస్తుంది. అమృతము వలె భక్తులను అమరులుగా

మార్చుతుంది. స్మిత చంద్రికా వికసిత ముఖేందు బింటే అని అన్నారు కదా!

~(సేకరణ : పి. యల్. నరసింహాచార్య దాసన్)~

[4:16 AM, 4/10/2019] Neeraja - Andhraprabha: కనకధారా స్తోత్రము ~ 13

**సంపత్కరాణి సకలేంద్రియ నన్దనాని**

**సామ్రాజ్య దాన నిరతాని సరోరుహాక్షి**

**త్వద్వందనాని దురితా హరణోద్యతాని**

**మామేవ మాతరనిశం కలయన్తు మాన్యే**

ప్రతిపదార్థాలు..

మాన్యే సరోరుహాక్షి మాతః ~ పూజ్యురాలగు పద్మాక్షి అయిన ఓ తల్లీ! సంపత్కరాణి సకలేంద్రియ నందనాని ~ సంపదలను కలిగించునవియు సర్వేంద్రియములను సంతోషపరచునవియు; సామ్రాజ్య దాన నిరతాని దురిత~ రాజ్యపదమును అనుగ్రహించుట యందు దీక్షగలవియు పాపములను; ఆహరణ ఉద్యతాని ~ పూర్తిగా నశింపచేయుటయందు ప్రయత్నములు కలవియు; త్వత్ వన్దనాని ~ నీకు నేను చేయు నమస్కారములు; అనిశమ్ మాం ఏవ కలయన్తు~ సదా నన్నే పావనమొనర్చుగాక!

భావము

పద్మ నయనములు ఉన్న పూజ్యురాలగు ఓ తల్లీ! నీకు చేయు నమస్సులు సర్వసంపదలను ఇస్తాయి. సర్వేంద్రియములను సంతృప్తి పరుస్తాయి. రాజ్యాధిపత్యాన్నిస్తాయి. పాపాలను పోగొడుతాయి. అమ్మా! సదా నీకు నమస్కరించు నన్ను పవిత్రుని గావించమ్మా!

వ్యాఖ్య

వందన భాగ్యము అందరికీ లభ్యమయ్యేది కాదు. భగవతికి చేయు వందనము బ్రతుకును నందనవనముగా మార్చుతుంది. ధనధాన్యాలు ఇవ్వలేని తృప్తినిచ్చి వందనము అక్షయ సంపద అయింది.

విషయ సుఖాలలో చరించి చరించి అలసిపోయిన ఇంద్రియాలు జగన్మాత సేవలో రమిస్తూ భక్తిరసములో మునిగి సంతృప్తి చెందుతాయి. ఐశ్వర్యాన్ని ప్రసాదించడమే గాక దురితాలను దూరము చేస్తాయి. దురితాలు దూరముకాగానే జీవులు పవిత్రమవుతారు. అందుకే మామేవ అనిశం కలయన్తు అని అన్నారు ~ అంటే ఈ వందన భాగ్యాన్ని తనవద్దనే ఉంచమని అంటున్నారు.

**యత్కటాక్ష సముపాసనా విధిః**

**సేవకస్య. సకలార్థ సంపదః**

**సన్తనోతి వచనాంగ మానసైః**

**త్వాం మురారి హృదయేశ్వరీం భజే**

ప్రతిపదార్థాలు

యత్ కటాక్షసముపాసనా విధిః ~ ఎవరియొక్క కటాక్షమును ఆరాధించుట అనెడి కార్యము; సేవకస్య సకలార్థ సంపదః ~ సేవకుడైన భక్తుడు సర్వ వస్తువులనూ ఐశ్వర్యములనూ; సంతనోతి మురాఫి హృదయేశ్వరీం ~ చక్కగా ఇచ్చుచున్నదో మురారి హృదయేశ్వరి యగు; త్వాం వచన అంగ మానసైః ~ నిన్ను వాక్కులచేతనూ కయముచేతనూ మనస్సు చేతనూ; భజే ~ భజించుచున్నాను.

భావము

అమ్మా! ఏ నీ కటాక్ష వీక్షణము సోకగనే నీ సేవకులైన భక్తులకు సకల సంపదలు సమకూరునో అట్టి మురారి హృదయేశ్వరియగు నిన్ను సదా త్రికరణ శుద్ధిగా భజిస్తాను.

వ్యాఖ్య

ముర అనే రాక్షసుని వధించి శ్రీమహావిష్ణువు మురారి అయ్యాడు. ముర ~ అనగా అజ్ఞానము. అజ్ఞాన నాశనమే రాక్షస సంహారము. అట్టి శ్రీమహావిష్ణువు హృదయేశ్వరి శ్రీమహాలక్ష్మి. కనుక అమ్మ దయతో అజ్ఞానము అంతరిస్తుంది. జ్ఞానము ఉదయిస్తుంది ~ ఇదే నిజమైన ఐశ్వర్యము. భౌతిక సంపద్కృతో తులతూగే వారు అందరూ ఈ ప్రపంచములో దిగులుతోనే కనిపిస్తున్నారు. దిగులు, గుబులు లేకుండా

జీవించడము భక్తులకే సాధ్యము. ఎందుకో తెలుసా? వారి సంపద క్షీణించేది కాదు ~ నశించేది కాదు ~ అది జ్ఞానైశ్వర్యము. అందుకే ఐశ్వర్య ప్రదాయిని అయిన అమ్మను త్రికరణ శుద్ధిగా భజించాలి.

**సరసిజ నిలయే! సరోజ హస్తే**
**ధవళతరాంశుక గంధమాల్య శోభే**
**భగవతి! హరి వల్లభే! మనోజ్ఞే!**
**త్రిభువన భూతికరి! ప్రసీద మహ్యామ్**

ప్రతిపదార్థాలు

సరసిజ నయనే సరోజ హస్తే ~ పద్మములను పోలిన కళ్ళు గల తల్లీ! పద్మము చేతియందు గల అమ్మా! ధవళ తరాంగ శుక గంధ మాల్య శోభే ~ శ్వేత వస్త్రము, శ్రీగంధము, సుమహారము వంటి తేజోమయీ! మనోజ్ఞే~ మనోహరీ!త్రిభువన భూతికరి భగవతి ~ త్రిలోకాలకు ఐశ్వర్య ప్రదాయిని, మహిమగల తల్లీ; హరివల్లభే ~ విష్ణుపత్నీ! మహ్యాం ప్రసీద ~ నా కొరకు అనుగ్రహింపుము!

భావము

ఓ కమలలోచనీ! కమలములను చేతియందు ధరించిన తల్లీ! శ్వేతవస్త్రము, శ్రీగంధము, తెల్లని పుష్పాల మాలను ధరించిన అమ్మా!

ముల్లోకాలకూ ఐశ్వర్యమును ప్రసాదించు భగవతీ! హరిసతీ! దయతో నన్ను అనుగ్రహింపుమమ్మా!

వ్యాఖ్య

చల్లని చూపుల తల్లీ! కమలములను చేతిలో ధరించి ఈ ప్రపంచాన్ని చల్లగా కాపాడే తల్లీ! తెల్లని వస్త్రముతో శోభించే తల్లీ! అల్లిన తెల్లని పూమాలను ధరించిన తల్లీ! ముల్లోకాలకూ కృపాజల్లును చల్లిన తల్లీ! అమ్మా! మళ్ళీ మళ్ళీ కురిపించు దయామృతాన్ని నీవైపు మళ్ళిన నాపై. అమ్మ హరిిసతీ ~

వేదాలలోని నాదాలు వాస్తవానికి జగజ్జనని పాదాలే! వేదాంత విజ్ఞానము అమ్మ పాదాలను శిరోధార్యముగా భావిస్తున్నాయి అని అంటారు. అమ్మా! నీ చరణములను ఉపనిషత్తులు శిరోభూషణములుగా ధరిస్తున్నాయి. తల్లీ! అట్టి నీ పవిత్ర చరణ సరోజములను నా తలపై కూడా పెట్టి నన్ను పవిత్రుణ్ణి చెయ్యి తల్లీ!

అమ్మా! నేను నీ బిడ్డను ~ అన్యుల వద్దకు వెళ్ళి బిచ్చమెత్తలేను ~ అహంకారము అడ్డువచ్చి కాదు ~ అభిమానము అడ్డు నిలిచి కాదు. నీ బిడ్డడు యాచకుడనిపించుకొంటే అది ఊహించలేను. నేను నీ బిడ్డ అని అందరికీ తెలిసిపోయింది. మా అమ్మా తల్లీ! ~ నాకెలా వస్తుంది దుర్గతి? నీ దయామృత సరోవరములో నన్ను మునక వేయనీవమ్మా! నీ కృపా మృత జలములో నన్ను మునక వేయించమ్మా!

**దిగ్గస్తిభిః కనక కుంభ ముఖావసృష్ట**
**స్వర్వాహినీ విమల చారు జల ప్లుతాంగీం**
**ప్రాతర్నమామి జగతాం జననీ మశేష**
**లోకాధినాథ గృహిణీ మమృతాబ్ధి పుత్రీం**

ప్రతిపదార్థాలు

దిక్ హస్తిభిః ~ దిక్కులను మోయు ఎనిమిది గజములచేత; కనక కుంభముఖ ~ సువర్ణ కలశముల ముఖములనుండీ; అవసృష్ట స్వర్వాహినీ విమల చారు జల ~ కుమ్మరించబడిన ఆకాశగంగయొక్క శుద్ధమైన మనోహరమైన నీటిచే; ప్లుత అంగీం జగతాం జననీం ~ తడుపబడిన శరీరముకలది లోకములకు మాతృదేవి; అశేష లోక అధినాథ గృహిణీం ~ సమస్త లోకములకు నాథుడైన అర్ధాంగియగు; అమృతాబ్ధి పుత్రీం ~ క్షీరసాగరుని కుమార్తెయగు శ్రీమహాలక్ష్మిని; ప్రాతః నమామి ~ ప్రాతః కాలమున నమస్కరించుచున్నాను.

భావము

దిక్కులను మోయు అష్టదిగ్గజములు బంగారు కలశములతో ఆకాశ గంగాజలములను తెచ్చి అమ్మ శరీరాన్ని అభిషేకిస్తాయి. శ్రీమహాలక్ష్మి సర్వలోక మాత ~ సర్వలోకాధిపతియగు విష్ణుదేవుని ఇల్లాలును, క్షీరసాగరుని పుత్రికయు అగు శ్రీదేవికి ప్రాతః కాలమున నమస్కరించుచున్నాను.

వ్యాఖ్య

క్షీరసాగరుని పుత్రిక ~ క్షీరసాగర శయనుని అర్ధాంగి యగు శ్రీమన్మహాలక్ష్మిని ప్రాతఃకాలమున స్మరించాలి ~ జ్ఞానక్షీరాన్ని పానముచేసి మోక్షానందములో పరవశించాలి. స్వర్ణముతో అందరూ సన్నని సంతృప్తి చెందుతారు. కానీ సువర్ణకలశాలతో దిగ్గజములు అమ్మను అభిషేకిస్తున్నాయి. కైవల్యానందము ముందు కనకము నిరుపయోగమైనది. దిగ్గజములు తెచ్చింది ఆకాశగంగ ~ తల్లిసేవలో మహోన్నతముగా భావ స్ఫూర్తితో చరించాలి. తల్లి బిడ్డను పాలిచ్చి పోషిస్తుంది ~ కానీ జగన్మాత పాలకడలినే నిలయముగా చేసుకుని ఉంది. ఇక బిడ్డలకు పాల కొరత ఏముంటుంది?

శ్రీమహాలక్ష్మి పాలిచ్చే తల్లి మాత్రమే కాదు ~ పాలించే తల్లి కూడా! కనుక క్షీరపానముతో జీవిత తొలిదశ ప్రారంభమగునట్లు క్షీరసాగర పుత్రికయగు లక్ష్మీదేవి స్మరణముతో ప్రారంభమై దినాలు సుదినాలు కావాలి ~ భక్తులు సద్భక్తులు కావాలి. సద్భక్తులు సమదర్శన యోగులు కావాలి.

**కమలే ! కమలాక్ష వల్లభే! త్వం**

**కరుణాపూర తరంగితై రపాంగైః**

**అవలోకయ మా మకించనానాం**

**ప్రథమం పాత్ర మకృత్రిమం దయాయాః**

ప్రతిపదార్థాలు

కమలాక్ష వల్లభే కమలే ~ ఓ విష్ణుపత్నీ! హరిప్రియా! అకించినానాం ప్రథమం ~ దరిద్రులలో మొదటివాడను; దయాయాః అకృత్రిమం పాత్రం~ తమ దయకు అనర్హుడను కానట్టి; మాం కరుణాపూర తరంగితైః ~ నన్ను కరుణా ప్రవాహముచే తరంగములు కలిగియున్న; అపాంగై అవలోకయ ~ క్రీగంటిచూపుతో చూడమ్మా!

భావము

కమలలోచనుని ప్రియురాలివగు ఓ కమలా! నేను దరిద్రులలో ప్రథముణ్ణి. మాయలెరుగని నన్ను నీ దయా ప్రవాహములో కదలాడు తరంగములైన నీ క్రీగంటి చూలులతో కృప చూచి కాపాడు తల్లీ!

వ్యాఖ్య

ప్రతి వ్యక్తీ జీవితములో ఎన్నో విషయాలు విచిత్రముగానూ విశేషముగానూ ఉంటాయి. అన్ని విషయాలనూ అందరితో చెప్పుకోలేరు. నాపృష్టః కస్యచిత్ బ్రూయాత్ ~ అడగనిదే ఎవరికీ చెప్పరాదు ~ అని శాస్త్రము. బిడ్డకు బాధ కలిగితే ఎవరికి చెప్పుకుంటాడు ~ తల్లి అడిగితే గానీ చెప్పను అని అంటాడా? అలాగే అమ్మా! నేను అతిదీనుణ్ణి ~ బలహీనుణ్ణి. నేను ఏ విషయములోనూ ప్రథముణ్ణి కాను దారిద్ర్యములో తప్ప ~అని భక్తుడు అమ్మకు మొర పెట్టు కొంటున్నాడు.

ఇందులో భక్తుని అర్హత, అమ్మ కరుణ రెండు ప్రధాన విషయాలు. దరిద్రులలో ప్రథముణ్ణి అని తన అర్హతను చెబుతూ అమ్మ దయాప్రవాహములో లేచిపడే తరంగములవలె ఉన్న క్రీగంటి చూపుతో దయ చూడమంటున్నాడు.

అమ్మ దయా ప్రవాహము నిత్యము ~ భక్తుని దారిద్ర్యము తాత్కాలికము. భుజించగానే ఆకలి తీరునట్లు అమ్మ దయ ప్రసరించగానే అది అంతమవుతుంది. ప్రవాహములో అల ఒక క్షణములో అలా కదలి కనుమరుగవుతుంది. అమ్మ దయాప్రవాహములో ఒక క్షణాన కనిపించే అల లాంటి క్రీగంటి చూపు తనపై పడగానే తన దారిద్ర్యం అంతరించిపోతుందనేది భక్తుని అభ్యర్తన.

**స్తువంతి యే స్తుతిభి రమూభి రన్వహం**
**త్రయీ మయీం త్రిభువన మాతరం రమాం**
**గుణాధికా గురుతర భాగ్య భాజినో**
**భవన్తి తే భువి బుధ భావితాశయాః**

ప్రతిపదార్థాలు

యే అన్వహం ~ ఎవ్వరు నిత్యమూ; త్రయీమయీం ~ వేదత్రయ స్వరూపమునైన; త్రిభువన మాతరం రమాం ~ ముల్లోకాలకూ తల్లియగు లక్ష్మీదేవిని; అమూభిః స్తుతిభి స్తువన్తి~ ఈ స్థుతులతో స్తుతిస్తున్నారో;

తే భువి అధికాః ~ వారు ఈ భూలోకమున అధిక గుణవంతులు; గురుతర భాగ్యభాజినః ~ విశేషముగా భాగ్యమును పొందినవారు; బుధభావిత ఆశయాః భవన్తి ~ బుధజనులచే పొగడబడిన చరిత్ర కలవారు అగుచున్నారు.

భావము

వేద స్వరూపిణి, ముల్లోకములకు తల్లి యునగు శ్రీమహాలక్ష్మిని నిత్యమూ ఈ స్థుతులతో కీర్తించువారు ఈ లోకమునందు అధిక సుగుణవంతులై బుధజనుల పొగడ్తలను పొంది ప్రకాశిస్తారు.

వ్యాఖ్య

తల్లి తెలుపు ~ తండ్రి నలుపు" ~ *నలుపు తాడనే భయముతోనేమో బిడ్డలు ఆంతర్యాన్ని తల్లికి తెలుపు కుంటారు ~ తెలుపు నలుపుల రంగు రహస్యాలెలా ఉన్నా తాము పచ్చగా మిగిలి పోవాలనుకుంటారు. మల్లెలవలె చల్లనైన , తియ్యనైన అమ్మ దయయే సర్వులకూ శ్రీరామ రక్ష. అందుకొమ్మని, ఆదుకొమ్మని అమ్మను అభ్యర్థించుటయే మనందరికీ సర్వజగద్రక్ష.

**సువర్ణధారా స్త్రోత్రం యత్ శంకరాచార్య నిర్మితమ్**

**త్రి సంధ్యం యః పఠేన్నిత్యం స కుబేర సమో భవేత్**

***